# పేదరికం లేని సమాజమే రంజాన్ ఆశయం

- ఫిత్రా, జకాత్‌లు పేదలకు తోడ్పడాలి
- రంజాన్ ఈద్ ప్రార్థనల్లో మత గురువుల పిలుపు



బెంగళూరు రోడ్డులోని ఈద్గా ప్రార్థనల్లో ఎమ్మెల్యే నవాజ్‌బాషా



ధార్మికోపన్యాసం చేస్తున్న మౌలానా జలాలుద్దీన్‌సాహెబ్

**మదనపల్లె సిటీ:** పేదరికం లేని సమాజ నిర్మాణమే రంజాన్ పండుగ ఆశయమని స్థానిక జామియా మసీదు ఇమాం మౌలానా జలాలుద్దీన్‌సాహెబ్ పేర్కొన్నారు. మదనపల్లెలో శనివారం ఉదయం ఈద్-ఉల్-ఫితర్ పండుగను ముస్లిం సోదరులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఇందులో భాగంగా స్థానిక నక్కలదిన్నెలోని ఈద్గా మైదానంలో ప్రత్యేక సామూహిక ప్రార్థనలు జరిగాయి. ఈ సందర్భంగా మౌలానా జలాలుద్దీన్‌సాహెబ్ ధార్మికోపన్యాసం చేశారు. రంజాన్ మాసంలో చేపట్టే జకాత్, ఫిత్రా, సదఖాలు పేదలకు తోడ్పాడాలన్నారు. రంజాన్ స్ఫూర్తిని జీవితాంతం కొనసాగించాలని తద్వారా ఓ ఆదర్శ సమాజ నిర్మాణంలో తమ వంతు బాధ్యతను నిర్వహించాలని కోరారు. ఇస్లాం శాంతిని కోరుకుంటుందని, ప్రతి ఒక్కరూ శాంతియుత జీవన విధానాన్ని అలవర్చుకోవాలన్నారు. తమ మతాలు ,ఆచారాలను పాటిస్తూనే ఎదుటివారి విశ్వాసాలను గౌరవించాలన్నారు. పండుగ విశిష్టతను తెలియజేశారు.

**ఈద్ ప్రార్థనల్లో ఎమ్మెల్యే**

నక్కలదిన్నె ఈద్గా మైదానం, మదనపల్లె మండలం బసినికొండ పంచాయతీ డ్రైవర్స్‌కాలనీలోని ఈద్గాలలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో ఎమ్మెల్యే ఎం.నవాజ్‌బాషా పాల్గొన్నారు. అందరికి ఈద్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రార్థనల్లో మున్సిపల్ వైస్ చైర్మన్ జింకా వెంకటాచలపతి, మున్సిపల్ కౌన్సిలర్లు వసీం, బీఏ ఖాజా, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇర్ఫాన్‌ఖాన్, రఫీక్ అహ్మద్, ఈశ్వర్‌నాయక్ అధిక సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి రంజాన్ ప్రార్థనల్లో పాల్గొన్నారు.

**భక్తి శ్రద్ధలతో ఈద్–ఉల్ ఫితర్**

**నిమ్మనపల్లె :** మండల పరిధిలో ముస్లిం మైనార్టీలు ఈద్-ఉల్‌ఫితర్ (రంజాన్) వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకున్నారు. శనివారం మండలంలోని అన్ని మసీదుల్లో రంజాన్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముందుగా మండల కేంద్రమైన నిమ్మనపల్లెలో ముస్లిం మైనార్టీలు అల్లాను ఆరాధిస్తూ నినాదాలతో ఈద్గా మైదానం వరకు ఊరేగింపుగా వెళ్లారు. పవిత్ర రంజాన్ మాసంలో కఠోర ఉపవాస దీక్షల నెల రోజులపాటూ ఆచరించి రంజాన్ పర్వదినాన ఉపవాసంతో ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ముస్లిం మసీదు ముతవల్లీలు ధార్మికోపన్యాసం చేసి రంజాన్ పర్వదిన విశిష్టతను తెలియజేశారు. ఇన్‌చార్జి ఎస్‌ఐ సుధాకర్ ఆదేశాలతో పోలీసులు ఈద్గాల వద్ద బందోబస్తు నిర్వహించారు.

**గుర్రంకొండలో..**

**గుర్రంకొండ:** మండలంలోని గుర్రంకొండ, తరిగొండ, మర్రిపాడు, చెర్లోపల్లె, సంగసముద్రం, టి.రాచపల్లె, శెట్టివారిపల్లె, అమిలేపల్లె, ఖండ్రిగ గ్రామాల్లో ముస్లిం సోదరులు రంజాన్ పండుగను ఘనంగా జరుపుకొన్నారు. శనివారం ఆయా గ్రామాల్లోని మసీదుల వద్దకు పెద్ద ఎత్తున చేరుకొన్నారు. అక్కడి నుంచి ర్యాలీగా ఈద్గాల వద్దకు చేరుకొని అక్కడే సామూహికంగా నమాజ్‌ను చదువుకొన్నారు. మత గురువులు, మతపెద్దలు పండుగ ఉపన్యాసాలు ఇచ్చారు .అనంతరం పరస్పరం ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. ఎస్‌ఐ దిలీప్‌కుమార్ ఈద్గాల వద్ద బందోబస్తు నిర్వహించారు.

**భక్తిశ్రద్ధలతో రంజాన్ ప్రార్థనలు**

**వాల్మీకిపురం:** ముస్లింలు అత్యంత పవిత్రంగా భావించే రంజాన్ పండుగను అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. శనివారం ఉదయం నుంచి మసీదుల వద్ద సందడి వాతావరణం కనపించింది. చిన్నా పెద్దా అందరూ కొత్త బట్టలు ధరించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికొకరు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. మండలంలోని చింతపర్తి, గండబోయనపల్లె, స్థానిక నిమ్మనపల్లె బస్టాండ్, బండమకాన్‌వీధిలోని మసీదుల్లో, హసన్‌ఖాన్‌వీధిలోని దర్గాలో, బైపాస్ రోడ్డు, నమాజ్‌కట్టవీధుల్లోని ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

**పెద్దమండ్యంలో..**

**పెద్దమండ్యం:** మండలంలో రంజాన్ పండుగ వేడుకలను శనివారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. పెద్దమండ్యం, పాపేపల్లె, కలిచెర్ల, శిద్దవరం, ముసలికుంట, వెలిగల్లు, తురకపల్లె గ్రామాలలో ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పెద్దమండ్యం సర్పంచ్ సోదనపల్లె బాబా, పాపేపల్లె సర్పంచ్ పీరాన్‌బీ, మాజీ సర్పంచ్ నజీర్ అహ్మద్, సర్కాజీ ఎస్‌ఎండి ఇస్మాయిల్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చాన్‌బాషా, ఆర్బికే చైర్మన్ చాను ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు.

**బి.కొత్తకోటలో..**

**బి.కొత్తకోట:** ముస్లింలు ఈదుల్‌ఫితర్ పండుగను శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం ఏడు గంటల నుంచే ఆ ప్రాంతాలకు చెందిన మసీదుల వద్దకు చేరుకుని అల్లాను స్మరించుకొంటూ పీటీఎంరోడ్డులోని ఈద్గాహ్ వద్దకు చేరుకున్నారు. అక్కడ మతగురువు ఈదుల్‌ఫితర్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కాగా మండలంలోని శంకరాపురం, బడికాయలపల్లె, హార్సిలీహిల్స్, తుమ్మనంగుట్ట, చీకుచెట్టుపల్లెల్లో పండుగ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

**ఘనంగా ఈద్ – ఉల్ ఫితర్**

**పెద్దతిప్పసముద్రం:** ముస్లిం సోదరులకు పవిత్ర పండుగ అయిన ఈద్-ఉల్- ఫితర్‌ను శనివారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని కందుకూరు, పీటీఎం, చెన్నరాయునిపల్లి, మద్దయ్యగారిపల్లి, విసనకర్రవాండ్లపల్లి, మల్లెల్ల తదితర గ్రామాల్లో ముస్లిం సోదరులు ఈద్గాల వద్దకు వెళ్లి ప్రజలంతా సుఖ సంతోషాలతో వుండాలని, వర్షాలు బాగా కురిసి పంటలు సమద్ధిగా పండాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత పెద్దలు రంజాన్ ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం ఒకరికొకరు ఈద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

**ములకలచెరువులో..**

**ములకలచెరువు:** మండలంలోని ముస్లిం సోదరులు శనివారం రంజాన్ పండుగను భక్తిశద్ధలతో నిర్వహించారు. ములకలచెరువు, సోంపల్లి, చౌడసముద్రం, కాలువపల్లి, పెద్దపాళ్యం, వేపూరికోట, దేవులచెరువు, బురకాయలకోటలోని ఈద్గా మైదానాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రజలు మంచి మార్గంలో నడవాలని, ఖురాన్ ప్రాముఖ్యతను మత గురువులు వివరించారు. అనంతరం వర్షాలు కురవాలని, ప్రజలకు మంచిరోజులు రావాలని అల్లాను వేడుకున్నారు.

**మత సామరస్యానికి ప్రతీక రంజాన్**

**పీలేరు :** మత సామరస్యానికి ప్రతీక అయిన రంజాన్ వేడుకలు పీలేరులో ఘనంగా నిర్వహించారు. నెల రోజులుగా కఠోర ఉపవాస దీక్షలు నిర్వహించిన ముస్లిం సోదరులు శనివారం ఈద్ ఉల్ ఫితర్‌ను జరుపుకున్నారు. స్థానిక మదనపల్లె మార్గంలోని ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రకృతి వైపరీత్యాలు, వర్షాభావ పరిస్థితులు, అంటు వ్యాధుల తదితర అనేక సమస్యల నుంచి సమాజాన్ని, ప్రజలను కాపాడలంలంటూ మత పెద్దలు ప్రార్థించారు. అనంతరం ఒకరుకొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. రంజాన్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు జాగ్రత్తగా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

**ప్రతి ఒక్కరిలో దానగుణం ఉండాలి**

**కలకడ :** ప్రతి ఒక్కరిలో దానగుణం కలిగి ఉండాలని, మంచిని పెంచి పేదలను ఆదుకున్నప్పుడే దైవసన్నిధి చేరుకుంటామనే సత్యం గ్రహించాలని ముతవల్లీలు అన్నారు. శనివారం రంజాన్ పండగ సందర్భంగా కలకడ, కోన, నడిమిచెర్ల, ముడియంవారిపల్లె, పాపిరెడ్డిగారిపల్లె గ్రామాలలో ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం పరస్పరం రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ఎస్‌ఐ సిటి స్వామి బందోబస్తు ఏర్పాటు చేశారు.

**ఘనంగా రంజాన్ వేడుకలు**

**కేవీపల్లె :** మండలంలోని వగళ్ల, లక్ష్మిరెడ్డిగారిపల్లె, గర్నిమిట్ట, మారేళ్ల, నూతనకాల్వ, గుర్రెడ్డిగారిపల్లె, కేవీపల్లె, గోరంట్లపల్లె, దేవాండ్లపల్లె, జాండ్రపేట, కమ్మపేట, తిమ్మాపురం, తురకపల్లె, గుండ్రేవారిపల్లె, తదితర గ్రామాలలో రంజాన్ పండుగను జరుపుకున్నారు. నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు ఆచరించిన ముస్లింలు శనివారం గ్రామ సమీపాల్లోని ఈద్గాల వద్ద మత గురువులను అనుసరిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సమాజం సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు. అనంతరం పేదలకు దాన ధర్మాలు చేశారు.

**నూతన ఈద్గా వద్ద రంజాన్ ప్రార్థనలు**

**కలికిరి:** రాజంపేట పార్లమెంటు సభ్యులు పీవీ మిథున్ రెడ్డి చొరవతో రూపుదిద్దుకున్న నూతన ఈద్గా వద్ద మండలంలోని ముస్లిం సోదరులు శనివారం రంజాన్ పర్వదినం సందర్భంగా ప్రార్థనలు నిర్వహించారు. ఎంపీ ఈద్గా స్థలానికి గాను రూ.14లక్షలు సొంత నిధులు ఇచ్చారు. ఈద్గా నిర్మాణానికి గాను రూ.5లక్షలు నిధులు ఎంపీ ల్యాడ్స్ నుంచి కేటాయించారు. అలాగే మండల పరిషత్ నుంచి రూ.10లక్షలు నిధులతో ఈద్గా ఆవరణలో తాగునీటి బోరు, భూమి చదును, దారి సౌకర్యాం తదితరాలు కల్పించారు. నూతనంగా రూపుదిద్దుకున్న ఈద్గా వద్ద శనివారం మైనార్టి కమిషన్ చైర్మెన్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని ముస్లిం సోదరులు పెద్ద ఎత్తున ప్రార్థనలకు హాజరయ్యారు.

**రామసముద్రం:** రామసముద్రం, చెంబకూరు, ఎం.గొల్లపల్లె, తిరుమలరెడ్డిపల్లెలో శనివారం రంజాన్ వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముస్లిం సోదరులు అందరు దిగువపేట నుంచి ప్రధాన రహదారి మీదుగా ఈద్గా మైదానం చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

**తంబళ్లపల్లె:** మండలంలోని ముస్లిం సోదరులు శనివారం భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. అల్లాను ప్రార్థిస్తూ ఈద్గా వద్దకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఇమామ్ బాబాజాన్ ఇస్లాం మత ప్రబోధాలను వివరించారు. అదే విధంగా ఎద్దులవారిపల్లె, రేణుమాకులపల్లె, కుక్కరాజుపల్లె, కోసువారిపల్లె, కొటాల, గుండ్లపల్లె, గంగిరెడ్డిపల్లె పంచాయతీలలో కూడా రంజాన్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.



నిమ్మనపల్లెలో ఈద్గా మైదానం వద్ద ప్రత్యేక ప్రార్థనలు



గుర్రంకొండ ఈద్గా వద్ద పోలీసు బందోబస్తు



హజరత్‌ఖాజాపీర్ మస్తాన్ వలి దర్గాలో..



గర్నిమిట్ట ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



కలకడ ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్థనలు







పీలేరులో ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్థనలు, కలికిరి : నూతన ఈద్గా వద్ద ప్రార్థనలు, బి.కొత్తకోట ఈద్గా మైదానంలో ..., పెద్దతిప్పసముద్రం: కందుకూరులో రంజాన్ ప్రార్థనలు, బురకాయలకోటలో ముస్లిం సోదరుల ప్రార్థనలు



## అదనపు ఎస్‌ఐగా కృష్ణమూర్తి

**వాల్మీకిపురం:** వాల్మీకిపురం అదనపు ఎస్‌ఐగా కృష్ణమూర్తి శనివారం బాధ్యతలు చేపట్టారు. అన్నమయ్య జిల్లా వీఆర్ నుంచి వాల్మీకిపురంకు వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం క్రిష్ణమూర్తి మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలు కాపాడేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సకాలంలో సేవలు అందిస్తామన్నారు.

## పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

**మదనపల్లె సిటీ:** స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జీఎంఆర్ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆంజనేయులు తెలిపారు. 2023–24 పాలిటెక్నిక్ కళాశాలల్లో అడ్మిషన్ల కోసం ప్రవేవపరీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో పేద,మధ్య తరగతి విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని కాలేజీలో నిష్టాతులైన అధ్యాపకులతో ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. పాలిసెట్‌కు దరఖాస్తు చేసుకున్న వారు శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## 20 లీటర్ల సారా స్వాధీనం

**పీలేరు రూరల్ :** మండలంలో 20 లీటర్ల సారా, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకుని నిందితున్ని అరెస్ట్ చేసినట్లు సెబ్ సీఐ గురుప్రసాద్ తెలిపారు. శనివారం ముందుగా అందిన సమాచారం మేరకు మండలంలోని గూడరేవుపల్లె వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గూడరేవుపల్లెకు చెందిన బాలకృష్ణ ద్విచక్రవాహనంలో సారా తరలిస్తుండగా అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. అలాగే రామానాయక్‌తండా ప్రాంతంలో దాడులు నిర్వహించి 400 లీటర్ల సారా ఊట, 5 లీటర్ల సారా ధ్వంసం చేసినట్లు తెలిపారు.

## ఎమ్మెల్యే నివాళి

**వాల్మీకిపురం:** మండలంలోని ఫత్తేపురంకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త నరసింహా రెడ్డి (79) అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి మృతుడి స్వగృహానికి చేరుకొని, మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## రేపు ఉచిత ఖత్నా

**పెద్దమండ్యం:** మండలంలోని ఎన్‌వోపల్లె పంచాయతీ కలిచెర్ల పాతురులో మదరసా అరబి రషీదియాలో సోమవారం ఉచిత ఖత్న ( వడుగులు ) కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మదనపల్లెకు చెందిన డాక్టర్ సికిందర్ పిల్లలకు ఖత్న చేస్తారని చెప్పారు. ఖత్న చేసుకున్న చిన్నారులకు మదరసా ఏ అరబియా రషిదియా కమిటీ వారి ఆధ్వర్యంలో ఉచితంగా మందులు, భోజన సరుకులు పంపిణీ చేస్తారని తెలిపారు. అవకాశాన్ని పేద ముస్లింలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# రక్తదానం ప్రాణదానంతో సమానం

**పీలేరు :** రక్తదాన ప్రాణదానంతో సమానమని వైఎస్సార్‌సీపీ రాజంపేట పార్లమెంటరీ యువజన విభాగం కన్వీనర్ చైతన్య రెడ్డి అన్నారు. శనివారం ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని స్థానిక కడప రోడ్డులోరక్తదాన శిబిరం నిర్వహించారు. తిరుపతికి చెందిన రక్షణ బ్లడ్ బ్యాంకు వారు 50 యూనిట్ల రక్తం సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయడానికి యువత ముందుకు రావడం అభినందనీయమన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాలు అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం కేక్ కట్ చేసి అభిమానులకు పంచి పెట్టారు. కార్యక్రమంలో సురేష్‌కుమార్‌రెడ్డి, జీవన్, శ్యామ్ రెడ్డి, రవి, ఇంతియాజ్, నవీన్, చింటు, కాటయ్య, వినోద్, అనిత్, అజీజ్, సోము, కేశవ పాల్గొన్నారు.



శిబిరంలో రక్తదానం చేస్తున్న యువత

# 27న మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం

**పీలేరు రూరల్ :** ఈ నెల 27న పీలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణస్వీకార కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఏపీ ఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక మార్కెట్ యార్డులో నూతనంగా నియమితులైన మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 27న మధ్యాహ్నం స్థానిక ఎంఎస్ఆర్ కల్యాణ మండపంలో నిర్వహించనున్న ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎ.టి. రత్నశేఖర్‌రెడ్డి, సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దండు జగన్‌మోహన్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ యల్లయ్య, వైస్ చైర్మన్ రమేష్ రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ కడప గిరిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి

# ఎంపీ నిధులతో తాగునీటి సమస్య పరిష్కారం

**గుర్రంకొండ:** మండలంలోని సంగసముద్రం పంచాయతీ మామిళ్లవారిపల్లె గ్రామంలో రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి నిధులతో తాగునీటి సమస్య పరిష్కారమైంది. గ్రామంలో కొద్దిరోజులుగా తాగునీటి సమస్య నెలకొంది. ఇటీవల ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా అక్కడి మహిళలు మండల సచివాలయల కన్వీనర్ నాగేంద్ర, సర్పంచ్ మంగళాంబలతో కలసి గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను వారి దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన వారు కొత్తబోరు వేయిస్తామని అప్పట్లో హామీ ఇచ్చారు. ఈనేపథ్యంలో శనివారం గ్రామానికి సమీపంలో కొత్తబోరు బావి తవ్వకం చేపట్టారు. ఇందులో నీరు పుష్కలంగా పడింది. దీంతో చాలాకాలంగా గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారమైంది. ఎంపీ, ఎమ్మెల్యేలకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు.



మామిళ్లవారిపల్లెలో కొత్తబోరు వేస్తున్న దృశ్యం

# ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌ను సద్వినియోగం చేసుకోండి

**వాల్మీకిపురం:** రైతులు ప్రకృతి వ్యవసాయంపై నిర్వహించే ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌ను సద్వినియోగం చేసుకోవాలని మండలంలోని మాధవరంపల్లి సర్పంచ్ వెంకటరమణా రెడ్డి తెలిపారు. శనివారం మాధవరంపల్లి గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ప్రతి రైతు 30 రకాల విత్తనాలను విత్తన గుళికలు చేసి వేసుకోవాలన్నారు. ఈ ర్యాలీలో ఏక పంట వద్ద, అంతర్ పంటలు ముద్దు, ప్రకృతి సేద్యం పుడమి తల్లికి నైవేద్యం, రసాయనాలు వద్ద కషాయాలు ముద్దు అని నినాదాలు చేసి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పెద్ద రెడ్డెయ్య, అనురాధ, వినోద్, నరేంద్ర రెడ్డి, మాధవి, రైతులు పాల్గొన్నారు.

## జగనన్నే మా భవిష్యత్తుకు విశేష స్పందన

**కేవీపల్లె :** మండలంలో వివిధ గ్రామాల్లో నిర్వహిస్తున్న జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. శనివారం మండలంలోని తిమ్మాపురం పంచాయతీలో జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నీవే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ కారపాకుల భాస్కర్‌నాయుడు, ఏపీఐఐసీ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రదీప్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కొన్ని వర్గాలకు, కొంత మందికి మాత్రమే ప్రభుత్వ పథకాలు అందేవని తెలిపారు. అదే ప్రస్తుతం జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని రాష్ట్రప్రభుత్వంలో కుల, మత, వర్గ, రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అసాంఘిక కార్యకలాపాల కట్టడికి చర్యలు

**మదనపల్లె :** మదనపల్లె డివిజన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాల కట్టడికి చర్యలు తీసుకోనున్నట్లు డీఎస్పీ కేశప్ప కోరారు. శనివారం పట్టణంలోని లాడ్జిల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం అప్రమత్తతతో వ్యవహరిస్తేనే నేరాల నియంత్రణ సాధ్యమవుతుందన్నారు. మారుతున్న పరిస్థితుల కారణంగా నేరస్తులు అనేక రకాలుగా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. నకిలీ అడ్రస్ ప్రూపులతో లాడ్జీల్లో ఆశ్రయం పొందుతున్నారన్నారు. లాడ్జిల యజమానులు కస్టమర్లకు రూములు ఇచ్చే ముందు తప్పక వారి వద్ద నుంచి సరైన అడ్రస్ కలిగిన ఆధారాలు తీసుకోవాలని సూచించారు. వారిపై ఎటువంటి అనుమానం కలిగినా వెంటనే పోలీసు అధికారులకు తెలియజేయాలని కోరారు. మదనపల్లె పట్టణ కర్ణాటక రాష్ట్ర సరిహద్దులో ఉండటం వల్ల నేరాలకు పాల్పడిన నిందితులు లాడ్జీల్లో ఆశ్రయం పొందే అవకాశం ఉందని, వారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో టూటౌన్ సీఐ మురళీకృష్ణ, తాలూకా సీఐ సత్యనారాయణ, రూరల్ సీఐ శివాంజనేయులు, ఎస్‌ఐలు జి.చంద్రమోహన్, హరిహరప్రసాద్, మదనపల్లె లాడ్జీల అసోషియేషన్ అధ్యక్షులు వి.సుధాకర్‌రెడ్డి, లాడ్జీల యజమానులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

**పీలేరు :** పట్టణంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా తెలిపారు. శనివారం స్థానిక తిరుపతి రోడ్డు మార్గంలోని ఆయిల్‌సీడ్స్ వద్ద స్కీంబోరుకు కొత్తగా మోటారు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ పరిధిలో మాట్లాడుతూ 75 స్కీంబోర్లు ఉన్నాయని, ఇందులో 45 బోర్లు మాత్రమే పని చేస్తున్నట్లు తెలిపారు. నాలుగు రోజులుకోసారి తాగునీటి సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఈవో రెడ్డిప్రసాద్‌రెడ్డి, శానిటరీ ఇన్స్‌పెక్టర్ రవికుమార్, కుసుమకుమార్‌రెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నలుగురు జూదరుల అరెస్ట్

**కలకడ :** పేకాట ఆడుతున్న నలుగురు జూదరులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.6780 నగదు , పేక మొక్కలు సీజ్ చేసినట్లు ఎస్‌ఐ సిటి స్వామి తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. శనివారం మండలంలోని గుడిబండ పంచాయతీ చొక్కన్నగారి పల్లె సమీపంలో పేకాట ఆడుతున్నట్లు అందిన రహస్య సమాచారం మేరకు ఎస్‌ఐ తన సిబ్బంది వేణుగోపాల్, సహదేవ, రమణనాయక్, నాగిరెడ్డిలతో కలిసి దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న శ్రీమన్నారాయణ, బాలాజి, మధుసూదన్, చంద్రశేఖర్‌లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.